సండే సందడి

- మురళీనగర్‌లో కళకళలాడుతున్న పార్కులు
- ఉత్సాహంగా గడుపుతున్న వాకర్స్, విద్యార్థులు

మురళీనగర్ : వారంలో ఆదివారానికి ఓ ప్రత్యేకత. ఆ రోజు గుర్తుకు రాగానే ప్రతి ఒక్కరిలోనూ ఏదో తెలియని ఆనందం... అనుభూతి కలుగుతుంది. వారంలో ఆరు రోజులు అలసిసొలసిన శరీరానికి ఒక ఉపశమనం. ప్రతి ఒక్కరిలోనూ ఎక్కడా లేని ఉత్సాహం ఉరకలేస్తోంది. విద్యార్థులకు ఆట విడుపు... ఉద్యోగులకు విశ్రాంతి సమయం..... ఇంటిల్లిపాదికీ అదొక ఆనందదాయక వ(వా)రం. ఎక్కడా లేని వినోదాలు గుర్తుకొస్తాయి. ఈ సమయంలో ఒక మంచి పని చేయాలని కొందరు ప్రణాళిక తయారు చేసుకుంటే మరి కొందరు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ప్రతి ఒక్కరూ వినోద విహారాలతో ఆనందాన్ని ఆస్వాదించాలని భావిస్తారు. ఇందుకు వేదికగా నిలుస్తున్నాయి మురళీనగర్‌లోని పార్కులు. మంచి పనులు చేయడానికి, బంధుత్వాలు పెంచుకోవడానికి వారంలో ఒక్క ఆదివారం చాలదా...!! అంటున్నారు.

పార్కులే ఆత్మీయ వేదికలు

మురళీనగర్‌లోని పార్కులు సందర్శకులు, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో వారి అభిరుచులను నెరవేర్చేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు, వాకర్స్ పార్కు, బృందావన్ పార్కు, సుదర్శన్ పార్కు, శ్రీదేవి పార్కు, హరిత పార్కు, ప్రశాంతి


బృందావన్ పార్కులో స్నేహితులతో చిన్నారులు, పెద్దల వ్యాయామం

ఆధ్యాత్మిక పార్కుల్లో సందర్శకులు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. దీంతో వాటిని సద్వినియోగం చేసుకుంటూ తమ అభిరుచులను నెరవేర్చుకుంటున్నారు. వాకర్స్, విద్యార్థులు, ఇతర సందర్శకులు ఆదివారం రాగానే పార్కులకు పెద్ద ఎత్తున తరలివస్తారు. తమ ఆత్మీయులను కలుసుకోవడానికి ఇదొక వేదికగా భావిస్తుంటారు. తమ స్నేహితులను కలిసి ముచ్చట్లు చెప్పుకుంటారు. ఒక్కొక్కరు ఒక్కో రకంగా పార్కుల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'మా' వాకర్స్ క్లబ్ సభ్యులు రోజూ ఒక నిర్దిష్ట సమయంలో కలుసుకుంటూ వాకింగ్ చేస్తారు. ఆదివారం రాగానే వీరంతా వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఉదయం కలుసుకుంటారు. పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ పార్కు వెలుపల సామూహికంగా తేనీరు సేవిస్తారు. ఇందుకయ్యే ఖర్చు ఆ రోజు ఒక సభ్యుడు భరిస్తాడు. ఇలా కలుసుకున్నప్పుడు మా ఆనందానికి అవధులు ఉండవని వారు చెబుతున్నారు.

ఆడుతూ ఆరోగ్య పరిరక్షణ

విద్యార్థులకు ప్రతీ ఆదివారం ఒక పండగనే చెప్పవచ్చు. బండెడు పుస్తకాలు పక్కన పెట్టేసి ఉదయం, సాయంత్రం స్నేహితులు, బంధువులతో కలిసి వ్యాయామం చేస్తారు. ఇలా బృందావన్ పార్కు,


వాకర్స్ పార్కులో శ్రమదానం చేస్తున్న సీనియర్ సిటిజన్స్

వాకర్స్ పార్కు, వైశాఖి స్పోర్ట్స్ పార్కులో స్నేహితులను ప్రతీ ఆదివారం కలుసుకుంటారు. మిగతా రోజుల్లో వ్యాయామం వారికి అనుకూలమైన చోట చేస్తున్నా ఆదివారం మాత్రం తప్పనిసరిగా పార్కుల్లోని ఓపెన్ జిమ్‌లకు వస్తారు. యువకులు బృందాలుగా ఏర్పడి షటిల్ బ్యాడ్మింటన్ ఆడేందుకు ఆదివారాన్ని ఎంచుకుంటారు. ఆ రోజు బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తూ క్రీడా స్ఫూర్తిని చూపుతున్నారు. స్పోర్ట్స్ పార్కులో లాన్ టెన్నిస్, వుడెన్ బ్యాడ్మింటన్ మైదానంలో షటిల్ బ్యాండ్మింటన్ ఆడుతారు.

ఎనిమిది పదులు దాటినా ఉత్సాహంగా...

వాకర్స్ క్లబ్ సభ్యుల్లో సుమారు వంద మందికిపైగా 80 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్స్ ఉన్నారు. వీరు ప్రతీ ఆదివారం ఒక ప్రత్యేకమైన కార్యక్రమం నిర్వహించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ రోజు కనీస వ్యాయామాలు పూర్తి కాగానే మొక్కల సంరక్షణ, పచ్చదనం పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్నారు. అంతేకాకుండా శ్రమదానంతో పార్కు పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు. ఖచ్చితంగా పార్కులోని గ్రంథాలయానికి హాజరై పుస్తక పఠనం చేస్తూ లోకజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకుంటున్నారు. సాయంత్రం అందరూ ఒకే చోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆదివారం ఓ వరమే



సీనియర్ సిటిజన్స్‌కు ఆదివారం వచ్చిందంటే ఎంతో ఉత్సాహం వస్తుంది. ఆ రోజు తప్పనిసరిగా మేమంతా ఏదో ఒక సామాజిక సేవ చేస్తాం. సాయంత్రం పార్కు ప్రాంగణంలో సమావేశమై కష్టసుఖాలు పంచుకంటాం. ఆ రోజు ప్రతి ఒక్కరూ ఒక తినుబండారం తెచ్చి అందరికీ పంచుతారు. ఇలా చేయడం వల్ల మా మధ్య అనుబంధం బలపడుతుంది. ఖర్చు కోసం ఎవరూ వెనుకాడరు. అందరికీ ఉపయోగపడే పని అనగానే విరాళాలు అక్కడికక్కడే ప్రకటించేస్తారు.

– పల్లా చంద్రమౌళి, వాకర్స్ పార్కు

మా ఆయుష్షు పెరుగుతోంది



వాకర్స్‌తో రోజూ కలవడంతోపాటు ఆదివారం తప్పనిసరిగా వారు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాం. మురళీనగర్‌లో వాకర్స్ క్లబ్ నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ మేము పాల్గొంటాం. ఇలా వారితో కలిసి గడపడం వల్ల మాకు మంచి జరుగుతోంది. ఒక రకంగా వారితో అనుబంధం కారణంగా మా ఆయుష్షు పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ అంటే మాకు చాలా ఇష్టం. బోన్సాయ్ వృక్షాలు పెంచుతాం. భావితరాలకు మంచి పరిసరాలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం (స్నేహితులు)


టీ(మ్) స్పాట్ ఫర్ ఆల్ : పార్కులో టీ తాగుతున్న "మా" వాకర్స్ క్లబ్ సభ్యులు

క్లుప్తంగా

అమర్‌నాథ్‌కు అభినందనలు


గుడివాడ అమర్‌నాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌ను 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించి, పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కౌన్సిల్ సభ్యత్వానికి దరఖాస్తు


సభ్యత్వాలను ద్వారకానాథ్‌కు అందిస్తున్న చంద్రమౌళి, తదితరులు

మురళీనగర్ : వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101లో కౌన్సిల్ సభ్యత్వానికి మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది 2025 సంవత్సరానికి క్యాబినెట్ సభ్యత్వానికి దరఖాస్తు చేసుకుని రుసుము చెల్లించారు. ఆ వివరాలతో కూడిన నివేదికను క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి 101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్‌కు ఆదివారం అందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట : చిన్నారులు తమదైన శైలిలోఅద్భుత చిత్రాలు గీసి అబ్బురపరిచారు. ఏబీయూ అకాడమీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలు అనే అంశంపై పోటీ నిర్వహించారు. ఉదయం చిత్రలేఖనం, సాయంత్రం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. తమ అలోచనలకు అద్దంపట్టేలా విద్యార్థులు అద్భుతమైన చిత్రాలు గీసి అబ్బురపరిచారు. అనంతరం పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు ఎస్.ఉషారాణి పర్యవేక్షించారు.

వైభవంగా సత్యసాయి అవతరణ దినోత్సవం


సత్యసాయి దివ్యరథం ఊరేగింపులో భక్తులు

మురళీనగర్ : మురళీనగర్‌లో శ్రీసత్యసాయిబాబా అవతరణ దినోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మాధవధార సమితి ఆధ్వర్యంలో ఐదు భజన బృందాలు, బాల వికాస్ విద్యార్థులు, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాభిరెడ్డితోట సత్యసాయి సమితి మందిరం నుంచి కలింగనగర్ 48వ నంబరు బస్టాపు వరకు ఊరేగింపు సాగింది. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం

మురళీనగర్ : రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. మురళీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కొత్త కమిటీ 2029 వరకు ఐదేళ్ల పాటు పని చేస్తుందని ఎన్నికల పరిశీలకుడు, సంఘం జాతీయ ప్రతినిధి డాక్టర్ పి.రాజశేఖర్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కె.లక్ష్మీపతిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామ్ ప్రసాద్, సీనియర్ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ పీవీ కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా బి.కృష్ణమూర్తి, బి.పాండురంగారెడ్డి, వై.కోటీశ్వరమ్మ, పి.అప్పారావు, కె.లతాదాస్, రామ్‌కుమార్, సీనియర్ సంయుక్త కార్యదర్శిగా ఎం.బాపిరాజు, సంయుక్త కార్యదర్శులుగా సీహెచ్ జగదీష్, బీవీ నాగేశ్వరరావు, వై.వెంకటరెడ్డి, ఎం.హరిగోపాల్, వి.నాగసుందరం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎల్.సుశీల, ఏవీ భాస్కరరావు, ఏవీవీవీ ప్రసాదరాజు, భాగ్యలక్ష్మి, మోహనలక్ష్మి ఎన్నికయ్యారు.


మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

అవకాశాల కల్పనే కళాకారులకు నిజమైన ప్రోత్సాహం

గాయకుడు గజల్ శ్రీనివాస్

ఎంవీపీకాలనీ: ప్రతిభకు అనుగుణంగా సినిమా, ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించడమే కళాకారులకు నిజమైన ప్రోత్సాహమని గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. సినీ గాయకుల వేదిక వైజాగ్ బీట్స్ సంస్థ 8వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన గాయకుల సత్కార వేడుకలో గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళా నైపుణ్యం ఉన్న వారికి ప్రస్తుతం అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని చెప్పారు. వారి ప్రతిభను సమాజానికి తెలియజేసేలా అవకాశం ఉన్న ప్రతి వేదికపైనా సత్తా చాటాలన్నారు. కొత్త కళాకారులకు సినీ రంగ ప్రముఖులు అవకాశాలు కల్పించాలని కోరారు. వైజాగ్ బీట్స్ గాయకులు అద్భుతంగా వారి సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఉదయం సినిమా డైరెక్టర్ పీసీ ఆదిత్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైజాగ్ బీట్స్ తరఫున హెచ్ఐవీ బాలలను సంరక్షిస్తున్న డిజైర్ సొసైటీ నిర్వాహకుడు లక్ష్మణ్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గజల్ శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్ పీసీ ఆదిత్యను సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గాయకులు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. కార్యక్రమంలో వైజాగ్ బీట్స్ వ్యవస్థాపకురాలు డి.శారద, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన సంస్థ సభ్యులైన గాయనీ గాయకులు పాల్గొన్నారు.


గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైజాగ్ బీట్స్ సంస్థ వ్యవస్థాపకురాలు శారద తదితరులు

సెలవు రోజున బాసర కళాశాలలో తరగతులు

అడ్డుకున్న ఏబీవీపీ సభ్యులు

మద్దిలపాలెం: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకతోటలోని బాసర జూనియర్ కళాశాలలో ఆదివారం సెలవు రోజున తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారని ఏబీవీపీ అర్బన్ జిల్లా కన్వీనర్ ఉమ్మడి నితిన్ అన్నారు. ఆదివారం నాడు తరగతులు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఏబీవీపీల బృందం కళాశాలను సందర్శించామన్నారు. బాసర కళాశాలలోని అన్ని తరగతుల్లో విద్యార్థులు ఉన్నారని గుర్తించామని చెప్పారు. సెలవుల్లో తరగతులు నిర్వహించడానికి వ్యతిరేకిస్తూ నిరశన చేపట్టామన్నారు. దసరా పండగ సెలవుల్లోనూ తరగతులు నిర్వహించారని విద్యార్థులు పేర్కొన్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ సంచాలకుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన, ఆర్ఐవో ఆదేశాల మేరకు ఇసుకతోట బాసర కళాశాలను ఆదివారం మూసివేశారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కన్వీనర్ నితిన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ లొడగల అచ్చిబాబు, రాష్ట్ర కో కన్వీనర్ రాయుడు నితిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్ నల్లబెల్లి, నైదాన ధనుష్, సిరిపురపు వాసు, కంచుమూర్తి విష్ణువర్ధన్, దార్ల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇసుకతోట బాసర జూనియర్ కళాశాల వద్ద నిరశన తెలుపుతున్న ఏబీవీపీ సభ్యులు

ఉక్కు ఉద్యమ నేత అమృతరావు జయంతి నేడు

ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కీలక భూమిక పోషించిన దివంగత టి. అమృతరావు జయంతిని సోమవారం స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించనున్నారు. గాంధీ మిషన్ ఆధ్వర్యంలో ఉక్కు హిల్ టాప్ కూడలి వద్ద ఉన్న స్మృతివనం వద్ద నిర్వహించనున్న వేడుకలకు ప్రజాప్రతినిధులు, వివిధ కార్మిక సంఘాలు నాయకులతో పాటు అమృతరావు మనుమడు టి. మోహన్ గాంధీ కూడా హాజరవుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం గుంటూరుకు చెందిన అమృతరావు విశాఖ కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి స్వయంగా వచ్చి అమృతరావుతో దీక్ష విరమింపజేశారు. ఈ నేపథ్యంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించడానికి కార్మిక సంఘాలు ఏర్పాట్లు చేశాయి.


అమృతరావు విగ్రహం

కనకమహాలక్ష్మి బ్యాంకుకు మూడు అవార్డులు


నిర్వాహకుల నుంచి అవార్డులు అందుకుంటున్న బ్యాంకు అధికారులు ప్రసాద్, చరణ్

సీతంపేట : కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకుకు బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ నిర్వహించిన ఉత్సవంలో మూడు విభాగాల్లో ఉత్తమ నిర్వహణ అవార్డులు లభించాయి. ఇటీవల లక్నోలో నిర్వహించిన బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ ఎన్‌సీబీఎస్ అండ్ ఎఫ్‌సీబీఏ కాన్ఫరెన్స్ – 2024లో అవార్డులను బ్యాంకు అధికారులు వీరేంద్ర ప్రసాద్, సాయి చరణ్ అందుకున్నారు. ఉత్తమ సైబర్ సెక్యూరిటీ, ఉత్తమ క్రెడిట్ ఇనీషియేటివ్, ఉత్తమ వార్షిక రిపోర్టు విభాగాల్లో అవార్డులు లభించాయి. అవార్డులు లభించడం వెనుక పాలకవర్గం సహకారం, సిబ్బంది కృషి ఉందని బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు. బ్యాంకుకు గత కొన్నేళ్లుగా అవార్డులు లభించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధిస్తామని బ్యాంకు సీఈవో కె.శ్యామ్ కిషోర్ తెలిపారు.

లలితాపీఠంలో సంకటహర చతుర్థి


గణపతి హోమం చేస్తున్న పండితులు

సీతంపేట : సంకట హర చతుర్థి సందర్భంగా స్థానిక లలితాపీఠంలో శనివారం సాయంత్రం వినాయకునికి ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన రోజని, మనుష్యులను కష్టాల నుంచి గట్టెక్కించే సంకట హర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. బహుళ అష్టమి సందర్భంగా బుధవారం ఉదయం చండీ హోమం, సాయంత్రం కాల భైరవ హోమం నిర్వహిస్తామని కృష్ణసేన్ తెలిపారు.

ఉక్కు ఉద్యమానికి సీఐటీయూ నాయకుల మద్దతు


రిలే నిరాహారదీక్షలో నినాదాలు చేస్తున్న భెల్ సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం భెల్ సీఐటీయూ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీటూ నాయకుడు ఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. ఎంతో మంది మహాత్ముల ప్రాణత్యాగాల ఫలితంగా వచ్చిన కర్మాగారాన్ని కాపాడుకోవడానికి అంతా సంఘటితంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కేంద్రపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.నారపురెడ్డి, బి.ఎస్.ఎన్.రాజు, కె.కామేశ్వరరావు, ఎ.సీతామహాలక్ష్మి, జి.అచ్చెన్నాయుడు, కనకారావు, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్, 11 కేవీ కైలాసపురం, శాంతిపురం, గణేష్‌నగర్ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. కస్తూరినగర్ – 1, 2, మధుసూదననగర్, దుర్గా కైలాస్‌నగర్, సత్యసాయినగర్, కైలాసపురం మెయిన్ రోడ్, వాసుదేవనగర్, సంజీవయ్యకాలనీ, గణేష్‌నగర్, గణేష్ సేవా సంఘం, నరసింహనగర్ మెయిన్ రోడ్, విశాఖ సదన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రోడ్లపైనే చెత్తకుప్పలు


ఆశీలుమెట్ట సమీపంలో పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని పలు ప్రాంతాలు చెత్తమయంగా తయారయ్యాయి. ఏ వీధి చూసినా చెత్తకుప్పలు దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. చెదురుమదురుగా వర్షాలు కురవడం, పారిశుధ్యం లోపించడంతో ఇప్పటికే సీజనల్ వ్యాధులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. స్థానిక టింపనీ స్కూల్ ప్రాంతంలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రైతుబజార్ లోపల కూడా పారిశుధ్యం అంతంతమాత్రంగానే ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చెత్త పేరుకుపోతున్నా సకాలంలో తరలించడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. డంపర్‌బిన్లు నిండిపోయినా తరలించకపోవడంతో ప్రజలు వాటి పక్కనే చెత్త వేయాల్సి వస్తోందని... అదంతా కింద పడడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు. ఆవులు, కుక్కలు, పందులు చేరి చెత్తను చిందరవందర చేస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు చెత్త తరలించి పారిశుధ్యం మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

రౌడీషీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార : సమాజంలో అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తనతో మెలగాలని ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి నుంచి వేలిముద్రలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. మంచిగా ఉంటే మంచిగా ఉంటామని... గొడవలకు పాల్పడినా, ఎవరినైనా బెదిరించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. సీఐ ఎస్.విజయకుమార్, ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య బీమా

సీతంపేట : ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య విశాఖపట్నం విభాగం సమావేశం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు తక్కువ ప్రీమియంతో రూపొందించిన ఆరోగ్య బీమా పథకాన్ని కంపెనీ ప్రతినిధి నరసింహమూర్తి వివరించారు. పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న విశ్రాంత ఉద్యోగులకు జీఎస్టీ తగ్గించాలని సభ్యులు కోరారు. సమాఖ్య తరపున ప్రతి నెలా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని అవసరమైన వారికి విద్య, ఆరోగ్య, ఆహార, ధన రూపేణ వీలైనంత సాయం చేయాలని సభ్యులు నిర్ణయించారు. సమాఖ్య సహాయ కార్యదర్శి టంకాల కామేశ్వరరావు, సూర్య భాస్కర్, కేశవరావు, కృష్ణారావు, రవికుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాలి

సీతమ్మధార : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార రైతుబజారు వద్ద నిరశన తెలిపారు. ప్రభుత్వం పెంచిన ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ విద్యుత్, వంట నూనె, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చినా తగ్గించలేదన్నారు. ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. భారీగా పెంచిన బియ్యం, పప్పులు, కూరగాయలు, డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు తగ్గించి ప్రజలందరికీ ఆహార భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో విద్యుత్‌పై రూ.8 వేల కోట్లు ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వంపై ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పడాల గోవింద్, రావికృష్ణ, ఎస్.మధురెడ్డి, శివ, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



రైతుబజారు వద్ద నిరశన తెలుపుతున్న సీపీఐ నాయకులు